
# నీలిమప్రియా హా డాట్ కామ్

సలీం



ఛాట్‌రూంలో తనకు నచ్చేలా ఛాట్ చేసే వ్యక్తి కోసం అరగంట నించి గాలిస్తున్నాడు నికితేష్. సమయం రాత్రి పది దాటింది. విసుగ్గా ఉంది లాగ్ ఆఫ్ అవుదామనుకున్నాడు. రకరకాల నిక్‌నేమ్స్‌తో అసభ్యమైన జోకులు వేస్తూ అర్థ రహితంగా ఛాట్ చేసేవాళ్ళే తప్ప నిజమైన స్నేహం కోసం నిజాయితీగా వెతుక్కునే వాళ్ళు ఒక్కరంటే  ఒక్కరు కూడా దొరక్కపోవటం అతన్ని నిరాశకు గురి చేసింది.

ఎన్నో రోజులనించి అతనో మంచి నేస్తం కోసం ఇంటర్నెట్‌లో ఛాట్‌రూంల వెంట పరుగెత్తుతున్నాడు. ఇరవై యేళ్ళుంటాయి. చిన్నప్పుడే అమ్మ చనిపోయింది. నాన్న రియల్ ఎస్టేట్ రంగంలో బాగా సంపాదించాడు. మరో పెళ్ళి చేసుకోకున్నా జల్సాలకు కొదువ లేదు. రోజుకో అమ్మాయితో తిరుగుతాడని అనుకుంటుంటారు. నికితేష్ కి తోడు అతని ఒంటరితనమే. పదిమందితో కలవాలంటే బిడియం. కాలేజీలో కూడా అతనికి స్నేహితులులేరు. ఎప్పుడూ ఉదాసీనంగా ఏదో పోగొట్టుకున్నట్లు ఉండే అతన్తో అమ్మాయిలు హలో దగ్గరే ఆగిపోతారు తప్ప మరో అంగుళం ముందుకెళ్ళటానికి ఇష్టపడేవారు కాదు. అతనికి ఆడపిల్లలంటే గౌరవం. నాన్న తిరుగుళ్ళ ప్రభావం అతని మీద బాగానే పడింది అందుకే జల్సాగా తిరిగే తన తోటి విద్యార్థులంటే అసహ్యం. అమ్మాయితో స్నేహం ఇష్టమే. కాని ఆ స్నేహం స్వచ్ఛంగా ఉండాలి. ఆమె ప్రేమ అమ్మ ప్రేమలా ఉండాలి.

అతను ఛాట్‌రూంనించి బైటికి రాబోతున్న తరుణంలో రూంలోకి కొత్తవ్యక్తి ప్రవేశించింది. నీలిమ.... అతన్ని బాగా ఆకర్షించింది ఆ పేరే. తమ స్వంతం కాని వింతవింత పేర్లతో ఛాట్ చేసే వాళ్లంటే అతనికి నచ్చదు. తప్పుడు పనేదో చేస్తున్నట్లు తమ ఐడెంటిటీని ఎందుకు దాచుకుంటారో... వెంటనే స్పందించి ప్రైవేట్ ఛాట్‌కి ఆహ్వానించాడు.

తెరమీద మరో డైలాగ్ బాక్స్ కన్పించింది.

''మీ అసలు పేరు అదేనా?'' నికితేష్ ఇంగ్లీష్‌లో టైప్ చేసి పంపించాడు.

''అవును'' వెంటనే సమాధానం వచ్చింది.

''నా పేరు కూడా నిజమైందే. నా కసలు నిక్‌నేమ్ లేదు తెలుసా. పెట్‌నేమ్ కూడా లేదు. మీరు అమ్మాయేనా''

''మీ వూళ్లో నీలిమ అనే పేరు అబ్బాయిలు కూడా పెట్టుకుంటారా? యింతకూ మీదే వూరు?''

''న్యూ ఢిల్లీ మరి మీదో''

''హైద్రాబాద్. మీ గురించి చెప్పండి''

''సివిల్ ఇంజనీరింగ్ ఫైనలియర్లో ఉన్నాను. అమ్మ చిన్నప్పుడే చనిపోయింది. నాన్న పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఎక్కువగా టూర్లలోనే గడుపుతుంటారు''.

''అయాం సారీ. మిమ్మల్ని బాధ పెట్టానా? నాకు అమ్మానాన్న ఉన్నారు. నేను మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్నాను. నాన్న కూడా డాక్టరే. హార్ట్ సర్జన్''

''నాతో స్నేహం చేస్తారా ప్లీజ్''

''తప్పకుండా. రేపు మరలా కలుద్దాం. నా ఈ మెయిల్ అడ్రస్ చెప్పనా? నీలిమ యాహూ డాట్ కామ్. గుడ్ నైట్''

నికితేష్‌కి చాల సంతోషంగా అన్పించింది. నీలిమ... ఎంత మంచి పేరు... కాబోయే డాక్టర్.... ఎంత సలక్షణంగా మాట్లాడిందో... తన కాలేజి అమ్మాయిల్లోని కొంటెతనం, అల్లరి మచ్చుకైనా కన్పించలేదు.

ఈ మెయిల్ ఇవ్వడానికి రేపటి వరకూ ఆగాలనిపించలేదు. తన మెయిల్ ఐడిని టైప్ చేసి యాహూ మెయిల్ తెరిచి ఉత్తరం రాయడం ప్రారంభించాడు.

''ఎన్నాళ్ళుగానో మోస్తున్న ఒంటరితనపు దుఃఖం నీ పరిచయంతో తీరిపోయేట్టుంది. అమ్మ ప్రేమకోసం తపించిన నా మనసుకి నీ స్నేహం మధుర మందారంలా హాయినిస్తోంది. ఓ నిజమైన స్నేహం కోసం, ఓ ఆత్మీయ స్పర్శకోసం ఎప్పటినుంచో చూస్తున్న నా అన్వేషణ ఆఖరి మజిలీ నీవు'' అంటూ తన ఉద్వేగాన్ని, భావుకతని ఉత్తరం నిండా నింపేశాడు.

మరునాడు జవాబు రాలేదు. రెండో రోజు కూడా రాలేదు. తనేమన్నా తొందరపడి అతి చనువు తీసుకుని రాశాడా అనుకుని మధనపడ్తున్న సమయంలో ఈ మెయిల్‌లోంచి అక్షరాలు జలజలా రాలాయి.

''ఇంకెప్పుడూ నువ్వు ఒంటరిననుకోకు. నీకు తోడుగా నేనున్నాను. నీ కిష్టమైతే జీవితాంతం ఉంటాను నా ఫోటో పంపిస్తున్నాను. నీకు నచ్చుతాన్లే. మరీ అందగత్తెని కాదు గానీ పర్వాలేదు. నీ ఉత్తరం నిండా తొణికిన కవిత్వం చాల బావుంది. ఐ లవ్ యూ''

మరునాడే అతను సమాధానంతో పాటు తన ఫోటో పంపాడు ''నువ్వు అప్సరసలా ఉన్నావు. నీ మనసంత అందంగా.....నేను చాలా అదృష్టవంతుణ్ణి. నీకేమైనా గిఫ్ట్ పంపాలంటే ఏ అడ్రస్‌కి పంపను?''

''ఇంటికి పంపిస్తే అమ్మానాన్నకు తెల్సిపోతుంది. నాస్నేహితురాలు శివాని. దానికి మన ప్రేమ గురించి అంతా చెప్పాను. నీ ఈ మెయిల్ ఇమ్మని మరీ పోరు పెడ్తే ఇచ్చాను. ఫర్లేదా? దాని బాయ్ ఫ్రెండ్ గిఫ్ట్‌లన్నీ పోస్ట్‌బాక్స్ నంబరు-999కి పంపిస్తాడు. నువ్వు కూడా అదే అడ్రస్‌కి పంపించు. నీ పేరు పెద్దక్షరాల్లో రాయటం మర్చిపోకు. అదసలే కోతి. తనవేనని లాక్కుంటుంది. మరీ కాస్ట్లీవి పంపకు. నువ్వు చాలా హేండ్సమ్‌గా ఉన్నావు'' నీలిమ ఈ మెయిల్ ఇచ్చింది.

''నువ్వు చాల విలువైన దానివి. నీ ప్రేమ వెలలేనిది. నా దగ్గర కావాల్సినంత డబ్బుంది. నాక్కావల్సింది నీ అనురాగం. నాకు బాగా నచ్చిన నెక్లెస్ పంపిస్తున్నాను. శివానికి హలో చెప్పు. నా తరపున థ్యాంక్స్ కూడా''

వారం తర్వాత శివాని నుంచి ఈ మెయిల్ వచ్చింది. ''నువ్వో పెద్ద మాంత్రికుడిలా ఉన్నావే. నీ కంటే అందమైనవాళ్ళు హైద్రాబాద్‌లో కొల్లలు. వాళ్ళ వైపు కన్నెత్తి కూడా చూడని నా స్నేహితురాల్ని బుట్టలో పడేశావే. కదిలిస్తే చాలు నీ కబుర్లే... విన్లేక చచ్చిపోతున్నావంటే నమ్ము. ప్రేమ పిచ్చి బాగా ముదిరినట్టుంది. జాగ్రత్తగా చూసుకో. నువ్వు పంపిన నెక్లెస్ చాలా బావుంది. ఐ ఫెల్ట్ జెలస్. నీ ప్రియురాలికే ఇచ్చాను మహాశయా. కావాలంటే అడిగి కనుక్కో''


వాళ్ళ ప్రేమ వయసిపుడు మూణ్ణెల్లు. రోజుకో ఈ మెయిల్ ఇవ్వందే-రోజుకో ఈ మెయిల్ అందుకోందే నిద్ర పట్టని పరిస్థితి నికితేష్‌ది.

ఆ రోజు కాలేజినుంచి రాగానే కంప్యూటర్ దగ్గర కూచుని ఈ మెయిల్ తెరిచాడు. సుదీర్ఘమైన ఉత్తరం ఉంది.

''నికితేష్.... నువ్వు నా ప్రాణమని తెలుసా నీకు. నువ్వు లేకుండా బతకలేనని నాకు తెలుసు. నా చదువైపోయాక నీతో పెళ్ళి వూహించుకుని సంబరపడే దాన్ని విధి మరోలా నాటకమాడబోతోంది. మా నాన్న స్నేహితుడి కొడుకుతో పెళ్ళి నిశ్చయమైంది. అతనూ డాక్టరే. ఫారిన్‌లో చదివాడు. చదువు పూర్తికాలేదన్న సాకుతో ఆపాలనుకున్నా వీలు కాలేదు. పెళ్ళయ్యాక చదువుకోమన్నారు. నాకు దిక్కు తోచడం లేదు. ఒక్కటి నిజం. నీవు లేని బతుకు వృధా. నన్ను నిజంగానే ప్రేమించావు కదూ. నాకు తెల్సు నువ్వు మోసం చేయవని. ఈ నెల ఇరవై ఆరో తారీఖున పెళ్ళి. నేనో నిర్ణయానికొచ్చాను. ఇరవై రెండో తేదీన సాయంత్రం అయిదింటినుండి నీ కోసం బిర్లామందిర్ దగ్గర చూస్తాను. నా నగలు, కొంత డబ్బు కూడా తెస్తాను. నన్ను తీసుకెళ్ళవా ప్లీజ్. రాత్రి ఎనిమిది వరకూ ఎదురుచూస్తా. రాలేదా నాకిక చావే గతి. మర్చిపోకు''.

నికితేష్‌కి ఏడుపొచ్చింది. నువ్వంత బేలగా అడగాలా నీలిమా.... నువ్వు నాకు దేవుడిచ్చిన వరానివి. ఎడారిదాహం తీర్చడానికి వచ్చిన చిరుజల్లులా నువ్వు నా జీవితంలోకి ప్రవేశించడం నా అదృష్టం అనుకున్నాడు.

''ఇరవై రెండో తారీఖున తప్పకుండా వస్తాను.



అసలు ఒకరోజు ముందే వస్తాను. ఉదయం నుంచే నీ కోసం బిర్లామందిర్ దగ్గర ఎదురు చూస్తాను. నగలు, డబ్బులు తేవద్దు. నా దగ్గర వాటికి కొదువ లేదు. నువ్వు నువ్వుగా వచ్చేయి చాలు'' రిప్లై ఈ మెయిల్ ఇచ్చాడు.

రెండ్రోజుల తర్వాత శివాని నుండి ఈ మెయిల్ వచ్చింది. ''నీలిమ ఏడుపు చూడలేకుండా ఉన్నాను. మీరిద్దరూ కలిసేరోజు కోసం ఎదురు చూస్తున్నాను. ఇరవై రెండున నేను కూడా వస్తాను. మీ ఇద్దరికీ సెండాఫ్ ఇవ్వడానికి. నువ్వు లేకుండా నీలిమ బతకదు. ఆ విషయం గుర్తుంచుకో''

''మనిద్దరికీ ఢిల్లీకి ఫ్లైట్ టిక్కెట్లు తీసుకున్నాను. ఇరవై రెండున సాయంత్రం ఏడింటికి ఫ్లైట్. నీకు శివానిలాంటి ఫ్రెండ్ ఉండటం అదృష్టం. మనం అయిదింటికి బిర్లా మందిర్ దగ్గర కలుద్దాం'' నికితేష్ జవాబిచ్చాడు.

ఇరవై ఒకటో తారీకునే హైద్రాబాద్ చేరుకున్నాడు. రాత్రంతా అసహనంగా నిద్ర లేకుండా గడిపాడు. ఉదయం లేచి ఫ్రెషప్ అయి హోటల్ గదిలోంచి బైట పడ్డాడు. బిర్లా మందిర్ చేరుకుని దైవ దర్శనం చేసుకున్నాడు. మధ్యాహ్నం దగ్గర్లో ఉన్న హోటల్ కెళ్లి భోంచేశాక మరలా బిర్లామందిర్ కెళ్ళి నీలిమ కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు.

నాలుగ్గంటల దగ్గర్నుంచీ టెన్షన్... నిమిషానికోసారి వాచి వైపు చూసుకున్నాడు. కాళ్ళు పీకుతుంటే మెట్టుమీద కూచున్నాడు. అయిదు దాటి పది నిముషాలైంది. అతనిలో అసహనం, భయం కూడా....నీలిమ వస్తుంది కదా...తప్పకుండా వస్తుంది. ఇంకా రాలేదెందుకో... ఏమైనా అవాంతరమా.... ఎవరైనా అడ్డుకున్నారా... ఆరు దాటింది నీలిమ జాడలేదు. ఏడు.... ఎనిమిది....ఫ్లైట్ మిస్సయినా నీలిమ కన్పిస్తే చాలని అతని ఆరాటం. తను సరైన స్థలానికే వచ్చాడు కదా. బిర్లామందిర్ అనేగా రాసింది... రెండు బిర్లా మందిర్లేమైనా ఉన్నాయా? అడిగి చూశాడు. లేదు ఇరవై రెండునే కదా.... ఈ రోజు తారీఖు ఇరవై రెండేగా....

అతనికేమీ పాలు పోలేదు. పిచ్చిపట్టేట్టుంది. దగ్గర్లో ఉన్న ఇంటర్నెట్ సెంటర్‌కెళ్ళి ఈ మెయిల్ ఇచ్చాడు. ప్రోగ్రాంలో మార్పేమైనా ఉందేమో?నీలిమ తప్పకుండా ఉత్తరం రాసి ఉంటుందని తన మెయిల్ వెతుక్కున్నాడు. ఉత్తరాలేమీ లేవు. శివానికి ఈ మెయిల్ ఇచ్చాడు. ఫలితం లేదు. మరునాడు సాయంత్రం నిరాశగా తిరిగెళ్ళిపోయాడు.

రెండ్రోజుల తర్వాత అతనికి శివాని నుంచి ఈ మెయిల్ వచ్చింది.

''ఎంత పని చేశావు? నువ్వింత మోసగాడివని వూహించలేదు. ఆ రోజు మధ్యాహ్నం నుంచీ నేనూ, నీలిమ బిర్లామందిర్‌లో పైన నీ కోసం ఎదురు చూశాం. గుడి మూసేసే వరకు అక్కడే ఉన్నాం. చివరికి నిరాశగా కిందికి దిగొచ్చాం. నువ్వు అక్కడా లేవు. ఆ రాత్రినీలిమ నిద్రమాత్రలు మింగింది. ఉదయం చూసి హాస్పిటల్‌కి తీసికెళ్ళినా ప్రయోజనం లేకుండా పోయింది. నీలిమ చనిపోయింది. కాదు నువ్వు చంపేశావు. పోలీసులు నీలిమ కొచ్చిన ఈ మెయిల్ ఉత్తరాల్ని పరిశీలిస్తున్నారు. నీకు తప్పకుండా శిక్ష పడుతుంది. అప్పటిగ్గాని నా స్నేహితురాలి ఆత్మ శాంతించదు''

నికితేష్‌కి ఆకాశం నెత్తిమీద కూలిపోయినట్లనిపించింది. నీలిమని తల్చుకుని గుండెలవిసేలా ఏడ్చాడు. తనెంత దురదృష్టవంతుడు? చిన్నప్పుడు అమ్మను పోగొట్టుకున్నాడు. ఇప్పుడు తన ప్రియురాల్ని చేతులారా చంపుకున్నాడు. తను భోజనానికి వెళ్ళినపుడు వాళ్ళు పైకెళ్ళి ఉంటారు. తను ఈ మెయిల్ ఇవ్వడానికెళ్ళినపుడు దిగిపోయి ఉంటారు.

వెంటనే అతనికి పోలీస్‌కేసు గుర్తొచింది. భయమేసింది.

జరిగిందేమిటో వివరిస్తూ శివానికి ఈ మెయిల్ ఇచ్చాడు. చివర్లో ''నాకు పోలీసులన్నీ, జైళ్ళన్నా చాలా భయం. మా నాన్నకు తెలిస్తే చంపేస్తాడు. ఎంత ఖర్చయినా పర్లేదు. ఏదో ఓ మార్గం వెతికి నన్నీ సమస్యనించి బైటపడేయి ప్లీజ్'' అని వేడుకున్నాడు.

శివాని హృదయం కరిగినట్టుంది. వెంటనే ఈ మెయిల్ ఇచ్చింది. ''నిజమే నీ తప్పేమీ లేదు. అంతా విధి విలాసం. దాని చావు అలా రాసి పెట్టి ఉంది. మా నాన్న స్నేహితుల్లో క్రిష్ణకిషోర్ అని హైకోర్టులాయర్ ఉన్నారు. చాలా ఫేమస్. ఫీజు కొద్దిగా ఎక్కువే. నీ గురించి చెప్పాను. ఈ మెయిల్ అడ్రస్ ఇచ్చాను. వారి ఈమెయిల్ కిషోర్ కె సిఫి డాట్ కామ్. వెంటనే వారిని సంప్రదించు. పోలీసులు ఢిల్లీ వచ్చే ప్రయత్నంలో ఉన్నారు. ఆలస్యంచేయకు''

నికితేష్‌కి ఆకాశం నెత్తిమీద కూలిపోయినట్లనిపించింది. నీలిమని తల్చుకుని గుండెలవిసేలా ఏడ్చాడు. తనెంత దురదృష్టవంతుడు? చిన్నప్పుడు అమ్మను పోగొట్టుకున్నాడు. ఇప్పుడు తన ప్రియురాల్ని చేతులారా చంపుకున్నాడు. తను భోజనానికి వెళ్ళినపుడు వాళ్ళు పెకెళ్ళి ఉంటారు. తను ఈ మెయిల్ ఇవ్వడానికెళ్ళినపుడు దిగిపోయి ఉంటారు.

నికితేష్ అదే రోజు క్రిష్ణ కిషోర్ గారికి ఈ మెయిల్ ఇచ్చాడు.

మరునాడు అతన్నుంచి రిప్లై వచ్చింది.

''నీ గురించి శివాని వివరంగా చెప్పింది. నువ్వు నీలిమకు రాసిన ఉత్తరాలన్నీ చదివాక పోలీసులు నీ మీద కేసు నమోదు చేశారు. వాళ్ళు ఢిల్లీ వచ్చి నిన్ను అరెస్ట్ చేయకుండా నా పరపతి ఉపయోగించి ఓ వారం వరకు ఆపగలను. ఈ లోపల నేనుపంపిస్తున్న పేపర్ల మీద సంతకాలు పెట్టి పంపించు. శివాని అడ్రస్‌కి అంటే పోస్ట్ బాక్స్ నంబర్ 999 యాభైవేల డిడి పంపించు. ఇది అడ్వాన్స్ మాత్రమే. నా ఫ్రెండ్ జగదీష్ ఈ మెయిల్ అడ్రస్ ఇస్తున్నాను. అతను ఏ.సి.పి. నీ దాకా ఎప్పటికీ పోలీసులు రాకుండా ఆపగల వ్యక్తి అతనే. వెంటనే అతన్ని రిక్వెస్ట్ చేసుకో. కోర్టు కేసు విషయం నాకు వదిలేసి నిశ్చింతగా ఉండు. పోలీస్ కేస్ జగదీష్ చూసుకుంటాడు. ఇటువంటి సమయంలో డబ్బుకి వెనుకాడితే ప్రమాదం. ఆ విషయం మర్చిపోవద్దు''

నికితేష్ యాభైవేలు రూపాయల డిడిని పంపించాక జగదీష్ గారికి ఈ మెయిల్ ఇచ్చాడు. రెండ్రోజులైనా సమాధానం రాలేదు. అతనికి కంగారెక్కువైంది. వారం దాటితే పోలీసులు తనని వెతుక్కుంటూ ఢిల్లీ రావటం ఖాయం. తనకు బేడీలు వేసి అందరూ చూస్తుండగానే జీపెక్కించటం ఖాయం. అలా జరిగితే నాన్న పరువు తన పరువు మట్టిలో కలిసిపోయినట్లే... వెన్నులోంచి దడ పుట్టుకొచ్చింది. నీలిమా! నా జీవితాన్ని పూలపాన్పు చేస్తావనుకుంటే మూర్ఖంగా చనిపోయి నా మెడకు ఉరితాడు బిగిస్తావా? ఇది నీకు న్యాయమా అనుకున్నాడు బాధగా. మరో రోజు ఎదురు చూశాడు. సమాధానం లేదు.

క్రిష్ణకిషోర్‌కి ఈ మెయిల్ ఇచ్చాడు. రిప్లై వచ్చింది.

''నీ కేస్ చాలా క్లిష్టంగా ఉంది. జగదీష్ కూడా చేతులెత్తేశాడు. వాళ్ళ కమిషనర్ చండశాసనుడు. కింది స్థాయి వాళ్ళకి చేతులు తడిపితే తప్పకుండా పనౌతుంది. జగదీష్ ఏ.సి.పి. స్థాయి అధికారి కదా. నిన్నడగడు. అవసరం నీది. ఆపదలో ఇరుక్కుంది నువ్వు అందుకే నువ్వే ఆఫర్ చేస్తే మంచిది. లేదంటే నిన్ను పోలీసులు అరెస్ట్ చేయటం మాత్రం ఖాయం. కోర్టులో కేసు సంవత్సరం నడవొచ్చు. రెండు సంవత్సరాలు పట్టొచ్చు. నీకు శిక్షపడకుండా కేసు నెగ్గుతాం. కానీ ఈ లోపల నువ్వు జైళ్ళోపడకుండా చూసుకోవాలిగా''

నికితేష్‌కి గుండె దడ హెచ్చింది. జగదీష్ గారికి మరలా ఈ మెయిల్ చేశాడు. ''సార్ మీరు తప్ప నన్ను అరెస్ట్ నుండి కాపాడేవాళ్ళెవరూ లేరు. మా నాన్నకు నేనొక్కడినే కొడుకుని. ఇలా అని తెలిస్తే మా నాన్న గుండె పగిలి చస్తాడు. ప్లీజ్ సార్. ఎంత ఖర్చయినా పర్లేదు. మీరెక్కడికి పంపమంటేఅక్కడికి డబ్బు పంపిస్తాను. మీ పోలీసులు ఢిల్లీకి రాకుండా ఆపండి. మీ సహాయాన్ని జన్మజన్మలకు మర్చిపోను''

దాంతోటే శివానికి కూడా ఈ మెయిల్‌లో ఉత్తరం పంపాడు.

''శివానీ....నాకు నీలిమ అంటే ఎంత ప్రేమో నీకు తెల్సు కదా. ఎన్నెన్ని వూహించుకున్నాను! నా బాధలన్నీ తొలగి పోయాయనుకున్నాను. ముందు జీవితమంతా అద్భుతంగా ఉంటుందని కలలు కన్నాను. నీలిమ భార్యగానే కాకుండా అమ్మలా నన్ను అక్కున చేర్చుకుంటుందనీ, ఇన్నాళ్ళ ప్రయాసంతా తన ఒడిలో సేద దీరుతూ మర్చిపోతాననీ అనుకున్నాను. నేను నష్ట జాతకుణ్ణి శివానీ. నీలిమ ఎంత తొందరపడిందో చూశావా... తన జీవితాన్ని అంతం చేసుకున్నట్లే నా జీవితాన్ని కూడా అంధకారం చేసి వెళ్ళిపోయింది. దానికి తోడు ఈ పోలీసుల గొడవా... కేసులు... మనశ్శాంతి లేకుండా పోయింది. చదువు మీద మనసు లగ్నం కావటం లేదు. నిద్ర పట్టటం లేదు. భయం... అమ్మ కూడా లేదు. నాన్న ఎప్పుడూ టూర్లలోనే గడుపుతారు. నాకూ చచ్చిపోవాలనిపిస్తోంది''

మరునాడు జగదీష్ నుండి ఈ మెయిల్ వచ్చింది.

''నువ్వు హైద్రాబాద్‌లో ఉండి ఉంటే కొంత సులభమయ్యేది. ఇప్పుడు ప్రతిదీ ఉత్తరాల ద్వారా అంటే రిస్క్ కదా. అందుకే నీ కేస్‌లో తల దూర్చకూడదనుకున్నా. కానీ క్రిష్ణకిషోర్ బలవంతం వల్ల నీకు సహాయపడటానికి ఒప్పుకున్నా లక్ష రూపాయల డిడి వెంటనే పోస్ట్ బాక్స్ నంబరు-999కి పంపించు. మిగతా విషయాలు నేను చూసుకుంటాను''.

శివాని కూడా ఉత్తరం రాసింది.

''మరీ చిన్న పిల్లాడిలా మాట్లాడకు. జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి. లైఫ్ ఈజ్ ఛాలెంజ్ - ఫేస్ ఇట్ అని విన్లేదా? నువ్వింకా చాలా అదృష్టవంతుడివి. ఏ సమస్య వచ్చినా ఎదుర్కోడానికి నీ దగ్గర డబ్బుంది. డబ్బుతో మన దేశంలో బోల్డు సాధించవచ్చు. అదిచ్చే ధైర్యం ముందు మిగతావన్నీ దిగదుడుపే డబ్బుంది. క్రిష్ణకిషోర్ అంకుల్ కేస్ టేకప్ చేశారు కాబట్టి నువ్వు హాయిగా నిద్ర పోవచ్చు. దిగులు పడకు. నేనున్నాను. నాకు చాతనైనంత సాయం చేస్తాను''

ఆ ఉత్తరం చదివాక అతనిక్కొంత వూరట కలిగింది.

మరునాడు జగదీష్ గారికి లక్ష రూపాయల డిడి పంపించాడు. ఆ సాయంత్రం శివానికి ఉత్తరం రాసి ఈ మెయిల్ చేశాడు.

''డబ్బుంటే సరిపోయిందా శివానీ... ఈ డబ్బు మా అమ్మని తీసుకురా గలుగుతుందా? నేను పోగొట్టుకున్న ప్రేమని అందివ్వగలుగుతుందా? నా ఒంటరితనాన్ని పోగొట్టగలుగుతుందా?నాకు పిడికెడు ఆత్మీయతని పంచగలుగుతుందా?'' అంటూ రాస్తున్నపుడు అతనికి కన్నీళ్ళు వచ్చాయి.

శివాని పోస్టాఫీసుకి వెళ్ళి డిడి తెచ్చుకుంది. క్రిష్ణకిషోర్ అంకుల్ కిస్తే జగదీష్ గారికి అందచేస్తారు. తన స్నేహితురాలు నీలిమ కోసం కదా ఇదంతా చేస్తోంది తను... ఆమె ప్రేమించిన నికితేష్‌ని రక్షించటమే తన ధ్యేయం పాపం నికితేష్...

రాత్రి తొమ్మిది గంటలు. ఇంటర్నెట్ సెంటర్‌కెళ్ళింది. కంప్యూటర్ ముందు కూచుని నికితేష్‌కి ఉత్తరం టైప్ చేసింది.

''నువ్వు చెప్పింది నిజమే. డబ్బు అమ్మ ప్రేమని తీసుకు రాలేదు. కానీ నిన్ను కోర్టు కేస్ నుంచి బైట పడేయగలదు. నువ్వు అరెస్ట్ కాకుండా అడ్డుకోగలదు. అన్నం లేని వాడికి అన్నం పెట్ట గలదు. చదువుని కొనివ్వగలదు. డబ్బులు లేనోళ్ళనడిగితే డబ్బుతో కొనగల ఇలాంటి సవాలక్ష విషయాలు చెప్తారు'' దాన్ని ఈ మెయిల్ చేశాక ఇంటర్నెట్ నిర్వాహకుడికి పది రూపాయలిచ్చి ఇంటికి తిరిగొచ్చింది.

చిన్న గది...దాన్నానుకుని బాత్రూం...అద్దె తక్కువని తీసుకుంది. కంప్యూటర్ కోర్సుతో డిగ్రీ ఉద్యోగాలని వెతుక్కుంటూ హైద్రాబాద్ వచ్చింది. వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా సరైన ఉద్యోగం దొరకలేదు. ఆర్థికావసరాలు... వూళ్ళో తను పంపించే డబ్బు కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూసే అమ్మా నాన్న చెల్లీ...

మంచం మీద పడివున్న డిడి వైపు చూసింది.

దాన్ని క్రిష్ణకిషోర్ అంకుల్‌కి ఇవ్వాలా వద్దా అని ఆలోచించింది.

ఇవ్వక పోవటం తప్పు కదూ. నమ్మక ద్రోహం కదూ. తప్పకుండా ఇవ్వాల్సిందేననే నిర్ణయానికొచ్చింది. ఎప్పుడివ్వాలి? రేపివ్వొచ్చుకదా. వుహు. తన దగ్గర డిడి ఉంటే ఏ క్షణమైనా తన మనసు మారిపోవచ్చు. టైం చూసుకుంది. పది కావస్తోంది. అమ్మో ఇంత రాత్రి వెళ్ళి ఇవ్వాలా? ఎంత రాత్రయినా సరే ఇప్పటికిప్పుడు ఇవ్వాల్సిందే అనుకుంది.

డిడిని చేతుల్లోకి తీసుకుని చూసింది లక్షరూపాయలు... ఒకటి తర్వాత అయిదు సున్నాలు...మనసు మారిపోక మునుపే అంకుల్‌కిచ్చేయాలి.

కళ్ళు గట్టిగా మూసి తెరిచింది. బలంగా శ్వాస తీసుకుంది.

''ఇదిగోండి అంకుల్ మీ డిడి'' అంటూ కుడి చేతిలో ఉన్న డిడిని ఎడం చేతిలో పెట్టింది.

''థ్యాంక్స్ శివానీ'' అన్నాడు క్రిష్ణకిషోర్. ''నేను కూడా ఇప్పుడే జగదీష్‌కి ఈ డబ్బు అందిస్తా నా దగ్గర పెట్టుకోను''

''జగదీష్, ఇదిగో డబ్బు. నికితేష్ అరెస్ట్ కాకుండా చూసే బాధ్యత నీదే'' అంటూ ఎడం చేతిలో ఉన్న డిడిని కుడి చేతిలోకి తీసుకుంది.

''నీలిమా! అసలీ డబ్బంతా నీకే చెందాలి. నువ్వే ఉంచుకో'' అంటూ మరలా డిడిని ఎడం చేతిలోకి మార్చుకుంది. ''శివానికో... ఏదీ శివాని... ఈ గదిలోనే ఉందా....'' అంటూ నలువైపులా చూసి ఆ అమ్మాయి పెద్దగా తెరలు తెరలుగా నవ్వింది.

## బాయ్‌ఫ్రెండ్ కోసం...

హేమమాలిని తల్లి అదుపాజ్ఞల్లో పెరిగినా, ఆమె కూతురు ఈషా మాత్రం డోంట్‌కేర్. డ్రీమ్‌గర్ల్‌గా పేరు గాంచిన హేమ తన కెరీర్‌లో ఎక్స్‌పోజింగ్‌కి ప్రాముఖ్యత ఇవ్వలేదు. అయినా ఆరోజుల్లో నడిచింది. ఇపుడు ఈషా ఎక్స్‌పోజింగ్‌కి ఏమాత్రం వెనుకాడ్డం లేదు. ఈషా మాటల్లోనే చెప్పాలంటే - ''అరే యార్, ఈరోజుల్లో మడిగట్టుకు కూర్చుంటే కుదరదు. నాకంటూ ఒక వయసొచ్చింది. కొన్ని అభిప్రాయాలున్నాయి. నా దృష్టిలో సెక్స్ తప్పుకాదు. కానీ సేఫ్ సెక్స్ చాలా అవసరం. అయినా దాని గురించి నాకేమీ తెలియదనుకోండి. నాకిప్పటివరకు బాయ్‌ఫ్రెండ్ కూడా లేదు. పొడుగ్గా నల్లగా అందంగా వుండే నా బాయ్‌ఫ్రెండ్ నల్లటి గుర్రంపై ఒక వెన్నెల రాత్రి స్వారీ చేస్తూ నా దగ్గరికొస్తాడని ఆశ!'' - ఆశలు బానే వున్నాయి.

